క్లుప్తంగా

ముమ్మరంగా రీ సర్వే పనులు



తీపనూరులో సరిహద్దు రాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్

చిల్లకూరు: భూ రీ సర్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయని తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ తెలిపారు. మండలంలోని ఓడూరు రెవెన్యూ పరిధిలోని తీపనూరులో జరుగుతున్న సర్వేరాళ్ల ఏర్పాటు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి వందేళ్ల క్రితం జరిగిన పనిని మరో సారి చేపట్టి భూ సమస్యలకు చెక్ పెడుతున్నారన్నారు. సచివాలయాల్లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సర్వేయర్లు నిత్యం భూములను సర్వే చేసి, హద్దురాళ్లను నాటుతున్నారన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



నగదు అందజేస్తున్న ఉప సర్పంచ్

సైదాపురం: ప్రభుత్వం మంజూరు చేసిన వైఎస్సార్ బీమా నగదు రూ.10 వేలు బాధితుడి కుటుంబసభ్యులకు బుధవారం అందజేశారు. సైదాపురం గ్రామానికి చెందిన ఇండ్ల పోలయ్య ఈ నెల 25వ తేదీన అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం నగదును ఉపసర్పంచ్ బి శివకుమార్ అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వంశీకృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, వార్డు సభ్యురాలు చెంచమ్మ, నేత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు ప్రారంభించండి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సైదాపురం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నాడు-నేడు పనులను ప్రారంభించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన దాడిశెట్టిపల్లె, చాగణం తదితర గ్రామాల్లోని పాఠశాలలు, సచివాలయాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల మెనూ ప్రకారం మంచి పోషకాహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసిందని చెప్పారు.

సేవాభావం కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణయాచేంద్ర

వెంకటగిరి: ప్రతి వ్యక్తికి కీర్తి ప్రతిష్టలు ముఖ్యం కాదని, సేవాభావం పెంపొందించుకోవడం బాధ్యతగా భావించాలని ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర తెలిపారు. కేఆర్‌పీఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆ ట్రస్టు చైర్మన్ కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డితో కలిసి ఆయన క్రాస్‌రోడ్డు కూడలిలో చలివేంద్రం ప్రారంభించారు. నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద పాల్గొన్నారు. పాలకేంద్రం సెంటర్‌లో చలివేంద్రాన్ని ఎంపీపీ తనూజారెడ్డి, పాత బస్టాండ్‌లోని చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, నేతలు వెంకటరత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు




గాయపడిన జనార్దన్

చిల్లకూరు: మండలంలోని కోట రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు కథనం మేరకు.. మండలంలోని కోట రహదారిపై నేదురుమల్లి రాజ్యలక్ష్మి గిరిజన కాలనీ దాటిన తరువాత గూడూరు వైపునకు వచ్చే మార్గంలో లారీ నిలుపుకుని డ్రైవర్ భోజనం చేస్తున్నాడు. అదే సమయంలో కోట వైపు నుంచి జనార్దన్ అనే వ్యక్తి బైక్‌పై గూడూరుకు వస్తూ అదుపు తప్పి లారీ వెనుక ఢీకొన్నాడు. దీంతో అతడు గాయపడ్డాడు. అటుగా వెళుతున్న అటవీ అధికారి మురళి ప్రమాదాన్ని గుర్తించి స్థానికులు సహకారంతో అతన్ని 108లో ఆస్పత్రికి తరలించారు.

మహిళకు అస్వస్థత

దొరవారిసత్రం: మండలంలోని పూలతోట గ్రామంలో మిరప కాయలు కోస్తున్న నాయుడుపేట మండలం శ్రీనివాసపురం ఎస్టీ కాలనీకి చెందిన సత్తివేటి లక్ష్మమ్మ బుధవారం పాముకాటుకు గురైంది. దీంతో ఆమె అస్వస్థతకు గురికాగా తోటి కూలీలు చికిత్స నిమిత్తం దొరవారిసత్రం పీహెచ్‌సీ తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం రూయాకు తరలించారు.







కోనలో పండుగ.. వెలుగులు నిండుగా..

రాపూరు మండలంలోని పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో మే ఒకటో తేదీ నుంచి జరగనున్న బ్రహ్మోత్సవాలకు కోనలో విద్యుత్ దీపాలంకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శ్రీవారి రాజగోపురానికి విద్యుత్ దీపాలంకరణ చేశారు. అలాగే దేవస్థానం ప్రాంగణంలో విద్యుత్ దీపాలతో స్వామి, అమ్మవారు, ఆంజనేయస్వామివారి కటౌట్లు, విద్యుత్ ఆర్చిలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పెంచలకోన పాలపుంతలా వెలుగులీనుతోంది. విద్యుత్ దీప కాంతులతో మెరిసిపోతోంది. - రాపూరు

మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే



దొరవారిసత్రం: కారికాడులో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

దొరవారిసత్రం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తమ దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించడం తథ్యమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. దొరవారిసత్రం మండలంలోని కారికాడు, మీజూరు, వేలికాడు, నాగినేరి గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి, ఆ కుటుంబానికి అందిన సంక్షేమ పథకాలు గురించి వివరించి బుక్‌లెట్ అందజేశారు. ప్రజల నుంచి ఎదురైన సమస్యలను కూడా అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. కారికాడు ఎస్సీ కాలనీలో పీఎంఏవై పథకంకి చెందిన హౌసింగ్ బిల్లుల చెల్లింపు విషయంలో మాత్రం జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపిస్తే, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. పేదల కోసం అహర్నిశలు శ్రమించే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అన్నారు. ఈ కార్యక్రమంలో చెంగాళ్లమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఈశ్వరవాక శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు భువనేశ్వరి, నాయకులు బాలరాజు, శేఖర్, మునస్వామినాయుడు, ప్రసాద్‌నాయుడు, బాబురెడ్డి, సురేష్‌రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.



సూళ్లూరుపేట: అయితా శ్రీనివాసరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి, తదితరులు

అయితా శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే పరామర్శ

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీ బాలాంజనేయ స్వామి ఆలయం చైర్మన్ అయితా శ్రీధర్ తండ్రి అయితా శ్రీనివాసరావు కొన్ని రోజులుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి బుధవారం ఆయన్ని పరామర్శించారు. ఆయన వెంట పార్టీ పట్టణ అధ్యక్షులు కళత్తూరు శేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు కళత్తూరు జనార్దన్‌రెడ్డి, జెట్టి వేణుయాదవ్, అలవల సురేష్, కాకి శ్రీరామ్మూర్తి తదితరులు ఉన్నారు.

ముస్లిం మైనార్టీల ద్రోహి చంద్రబాబు

గూడూరు: చంద్రబాబు ముస్లిం మైనార్టీల ద్రోహి అని, పెదకూరపాడులో ఆయన మాటలతో ఆ విషయం స్పష్టమైందని, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మగ్దూం మోహిద్దీన్ అన్నారు. దర్గావీధిలోని ఆయన నివాసంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెదకూరపాడులో జరిగిన సమావేశంలో చంద్రబాబు, ప్రధాని నరేంద్రమోడీ పాలనను పొగడ్తలతో ముంచెత్తారన్నారు. ఆయన విజన్‌తో పూర్తిగా ఏకీభవిస్తున్నానని చెప్పారన్నారు. కానీ ఇటీవల తెలంగాణలో జరిగిన బహిరంగ సభలో అమిత్‌షా మాత్రం బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లింల రిజర్వేషన్లు ఎత్తి వేస్తామని చెప్పారని తెలిపారు. టీడీపీలో ఉన్న ముస్లింలు బాబు కపట యోచనలకు బలికావద్దని, ఆ పార్టీని వదిలి బయటకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు గులించెర్లలో గడపగడపకు మన ప్రభుత్వం

సైదాపురం: మండలంలోని గులించెర్ల సచివాలయ పరిధిలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు నలమారు రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

ఆర్థిక ప్రగతి సాధించాలి

పెళ్లకూరు: ప్రభుత్వం అందిస్తున్న ఆసరా, జగనన్న తోడు, సున్నా వడ్డీ తదితర పథకాలతో పొదుపు మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని ఎంపీడీఓ సురేష్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఏపీఎం మునిరాజయ్య, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో చెట్లు తొలగింపు

గూడూరు: రెండవ పట్టణంలోని అడవయ్య కాలనీ సమీపంలో ఉన్న హిందూ శ్మశానవాటికలో గోపాల్ యాదవ్ తన స్నేహితులతో కలసి జేసీబీతో చెట్లు, చెత్తా చెదారం తొలగించి, శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిహేనేళ్లుగా ఏటా ఈ శ్మశానాన్ని శుభ్రపరచే ప్రక్రియను తానే నిర్వహిస్తున్నానన్నారు.

బీమా పథకాలపై అవగాహన

చిట్టమూరు: స్థానిక స్త్రీ శక్తి భవనంలో గురువారం ప్రభుత్వ బీమా పథకాలపై ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మల్లాం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్, ఈఓపీఆర్డీ మనోహర్ గౌడ్, ఏపీఎం హైమావతి, బ్యాంక్ సిబ్బంది ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

భూములు మంజూరు చేయండి

ఓజిలి: సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలని భువనగిరిపాళెం గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీలు బుధవారం తహసీల్దార్ లాజరస్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు ఆయనకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్లు 67-3,4లో 8.02 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎస్సీ, ఎస్టీ, బీసీలు 17 కుటుంబాలకు చెందిన తాము సాగుచేసుకుంటున్నామని, తమకు పట్టాలు మంజూరు చేయాలని తహశీల్దార్‌ను కోరారు. స్పందించిన తహసీల్దార్ గ్రామంలో వీఆర్వోతో సర్వే చేయించి, నివేదిక తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

నేడు భూ పంపిణీకి అర్జీల స్వీకరణ

చిట్టమూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం మండలంలో భూ పంపిణీపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, అర్జీలు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి గూడూరు ఎమ్మెల్యే వెలపగల్లి వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, బల్లి కల్యాణ్ చక్రవర్తి, గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ హాజరవుతారన్నారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

కండలేరులో 38.553 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 38.553 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,680 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 50, లోలెవల్ స్లూయిస్‌కు 30, హైలెవల్ స్లూయిస్‌కు 60 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

వంద రోజులు పని కల్పించాలి

గూడూరురూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనని ఇన్‌చార్జి ఏపీఓ గిరి అన్నారు. ఇటీవల గుండెపోటుతో గూడూరు ఏపీఓ వెంకటరమణయ్య మృతి చెందడంతో ఆయన స్థానంలో చిల్లకూరు ఏపీఓను ఇన్‌చార్జిగా నియమించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ఉపాధి పనులను ఉదయం 5.30 గంటలకు మొదలు పెట్టి 9.30 లోగా ముగించాలన్నారు. మౌలిక వసతులు కల్పించాలన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

సైదాపురం: ఉపాధి హామీ పథకం కూలీల సంఖ్య మరింత పెంచాలని ఏపీడీ శ్రీహరిరెడ్డి ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది క్షేత్ర స్థాయిలో పని ప్రదేశాన్ని పరిశీలించి గ్రామాభివృద్ధికి ఉపయోగపడేలా పనులను చేయించాలన్నారు. కూలీలు పనిచేసే చోట్ల తప్పనిసరిగా నీడతో పాటు తాగునీరును ఏర్పాటు చేయాలన్నారు. ఏపీఓ మురళి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రండి!

వెంకటగిరి: నియోజకవర్గంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు బుధవారం విజయవాడలో ఆయన ఆహ్వాన పత్రికలను అందజేశారు.



టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


నాయుడుపేటటౌన్: మండలంలోని విన్నమాలలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలోని జ్ఞానప్రసూనంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయాల మాజీ చైర్మన్ ఆరవభూమి ప్రభాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం షిరిడీ సాయి వైద్య నాథ బాబా ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో వైద్యులు రంజిత్, మహ్మద్ హర్షద్, ధనుష్ పాల్గొని, రోగులకు పరీక్షలు చేశారు. ఆరవభూమి రాజశేఖర్ రెడ్డి, నాయకులు వేణుంబాక లక్ష్మీనారాయణరెడ్డి, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు

గడ్డివామి దగ్ధం

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు గ్రామంలో గడ్డివామి బుధవారం దగ్ధమైంది. బాధి తుని కథనం మేరకు.. శిరసనంబేడు గ్రామానికి చెందిన బండారు కృష్ణమూర్తి వరికోతల సమయంలో పశువుల మేత కోసం 246 వరి మోపులు గడ్డి కొనుగోలు చేసి, వామి వేసి ఉంచాడు. ప్రమాదవశాత్తు గడ్డివామికి నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. స్థానికులు గుర్తించి నాయుడుపేట అగ్రిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అప్పటికే మంటల్లో గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో సుమారు రూ.25 వేలు వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: వైఎస్సార్ సీపీ హయాంలో పార్టీలకతీతంగా కేవలం అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేర, పచ్చచొక్కాలకు, వారు చెప్పినవారికే పథకాలను అందజేసిన ఘనుడు చంద్రబాబు అని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. సొసైటీకాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం ఆయన 'మా నమ్మకం-నీవే జగన్' స్టిక్కర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి వెళ్లగా, ప్రజలంతా ఎంతో సానుకూలంగా స్పందించారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రభుత్వ హయాంలో తామెన్నో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందామని, తమ మద్దతు జగనన్నకేనంటూ సంతోషంగా చెబుతున్నారన్నారు. ఎన్ని అవాంతరాలు, అడ్డంకులు వచ్చినా, వెనక్కు తగ్గకుండా, ఇచ్చిన హామీలనే కాకుండా, ఇవ్వని మరెన్నో హామీలను కూడా నెరవేర్చిన ఘనత ఒక జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు బీ శ్రీనివాసులు, సీనియర్ నాయకులు బీ విజయ్‌కుమార్, చిల్లకూరు జెడ్పీటీసీ ఎం శీనయ్య, నరసయ్య, అజీజ్, రాజారెడ్డి తదితరులున్నారు.

సీఆర్‌రెడ్డి..చిరస్మరణీయులు

డాక్టర్ సీఆర్‌రెడ్డి ఈ ప్రాంత ప్రజలందరి గుండెల్లో చిరస్మరణీయులని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. గూడూరుకు చెందిన డాక్టర్ సీఆర్‌రెడ్డి (95) సోమవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు సీఆర్‌రెడ్డి నివాసంలో బుధవారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమార్తె, డాక్టర్ రోహిణి, అల్లుడు జనార్దన్‌రెడ్డిలతోపాటు, కుమారుడు సుధీర్‌రెడ్డిని పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిని విజయ్‌కుమార్, తాళ్లూరు శ్రీనివాసులు, అన్నం మురళి, సుబ్బారెడ్డి తదితరులున్నారు. అలాగే డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ సీఆర్‌రెడ్డికి నివాళులర్పించారు. లయన్స్ వరిదిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, డీ రవీంద్రరెడ్డి, ఆర్వీరావు, మంజులాదేవి తదితరులు పాల్గొన్నారు.



సీఆర్‌రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

జగనన్న పథకాలు దేశానికే ఆదర్శం

కోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని వజ్జావారిపాళెంలో ఎంపీ లాడ్స్ నిధులు రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్వోప్లాంట్ కోసం నిధులిచ్చిన తిరుపతి ఎంపీ గురుమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరమాల వెంకటరమణయ్య, శ్రీరాంగురుస్వామి, ప్రసాద్, రఘురామయ్య పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలు పాటించాలి

చిల్లకూరు: వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటున్నందున ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతంలో క్షేత్ర సహాయకులు జాగ్రత్తలు పాటించాలని ఆ పథకం తిరుపతి పీడీ శ్రీనివాసప్రసాద్ సూచించారు. మండలంలోని తిమ్మనగారిపాళెంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, మస్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పలు ప్రాంతాల్లో పనులను పరిశీలించామని, అయితే ఎక్కడా వేసవి జాగ్రత్తలు పాటించడం లేదన్నారు. చిల్లకూరు మండలంలో పారిచెర్లవారిపాళెం, తిమ్మనగారిపాళెంలో నీడ, తాగునీటి వసతి కల్పించడం అభినందనీయమన్నారు. ఆయన వెంట ఏపీఓ గిరిబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీ, క్షేత్ర సహాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఉపాధి హామీ పీడీ శ్రీనివాసప్రసాద్

కల్లూరులో ఆగని భూ ఆక్రమణ

దొరవారిసత్రం: కల్లూరు సమీపంలోని అటవీ పోరంబోకు భూమి ఆక్రమణలు యథావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి. దీన్ని అరికట్టే విషయంలో రెవెన్యూ అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. నిన్న మొన్నటి వరకు కల్లూరు గ్రామస్తులు, ఎస్సీ, ఎస్టీల మధ్య తమకు ఇవ్వాలంటే తమకు కావాలని భూముల కోసం వివాదాలకు దిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సూరపుఅగ్రహారం గ్రామానికి చెందిన పలువురు ఎస్సీలు తమకు కూడా అటవీ పోరంబోకు భూములను ఇవ్వాలంటూ బుధవారం చెట్లను తొలిగించి హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక వీఆర్వో మధు ఘటన స్థలానికి వెళ్లి ఎవరూ అటవీ పోరంబోకు భూముల్లో దిగేందుకులేదని హెచ్చరించి వెళ్లగొట్టారు. ఇది ఇలాఉండగా కల్లూరులోని పలువురు ఎస్టీలు పోరంబోకు భూముల్లో గుడిసెలు వేశారు. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను కూడా ఆక్రమణదారులు చించిపడేశారు.



అటవీ పోరంబోకు భూమిలో ఎస్టీలు వేసిన గుడిసెలు

సమన్వయంతో సామాజిక తనిఖీ

కలువాయి: పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పేరెంట్స్ కమిటీలను సమన్వయ పరచుకుని పాఠశాలల్లో సామాజిక తనిఖీలు నిర్వహించాలని ఎంపీడీఓ ఏ.అప్పాజీ తెలిపారు. స్త్రీ శక్తి భవనంలో బుధవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో హెచ్‌ఎంలు, సీఆర్పీలకు సామాజిక తనిఖీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ బాలకృష్ణారెడ్డి, రిసోర్సుపర్సన్లు పి.సుధాకర్, షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై అవగాహన

దొరవారిసత్రం: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం హెచ్‌ఎంలకు (సోషల్ అడిట్)సామాజిక తనిఖీపై అవగాహన కల్పించారు. రిస్సోర్స్ పర్సన్ శివనారాయణ మాట్లాడుతూ పేరెంట్స్ కమిటీ సభ్యులు పాఠశాలలను తనిఖీ చేసి, విద్యార్థులకు మౌలిక వసతులు ఉన్నాయా లేదా అనే విషయాలను గుర్తించి, యాప్‌లో సంబంధిత సమస్యను అప్‌లోడ్ చేసి, ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకువెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మస్తానయ్య, హెచ్‌ఎంలు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

గూడూరురూరల్: మండలంలోని నెర్నూరు సమీపంలో ఈనెల 23వ తేదీ రాత్రి భార్యను హత్య చేసిన భర్త నాగరాజును రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం గూడూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ఈ వివరాలను వెల్లడించారు. గూడూరు పట్టణంలోని వరదానగర్‌లో నాగరాజు, శ్రావణి దంపతులు 15 ఏళ్లు నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరు తోటల వద్ద పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల వెంకటేశ్వర్లు అనే వ్యక్తితో శ్రావణి సన్నిహితంగా ఉంటూ ఇంట్లో పిల్లలను వదిలి, అతనితో తిరుగుతుండడంతో ఈనెల 23వ తేదీ భర్త నాగరాజు శ్రావణికి ఫోన్ చేసి మాట్లాడగా ఆమె దురుసుగా మాట్లాడింది. దీంతో ఆగ్రహించిన భర్త నాగరాజు నెర్నూరు సమీపంలోని తోట వద్ద ఉన్న శ్రావణిపై కత్తితో దాడి చేశాడు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడి, మృతి చెందింది. దీంతో పరారీలో ఉన్న నాగరాజును మంగళవారం రాత్రి అరెస్టు చేశామని, బుధవారం కోర్టులో హాజరు పరిచామని డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ జి.దశరథరామారావు, ఎస్ఐ బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

యూజర్ చార్జీల పెంపు

నాయుడుపేట: రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకునే ప్రతి దస్తావేజుపై యూజర్ చార్జీలు పెంచినట్లు నాయుడుపేట సబ్ రిజిస్ట్రార్ శోభమ్మ తెలిపారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పెంచిన యూజర్ చార్జీలు మంగళవారం నుంచి అమలులోకి వచ్చాయన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకునే ప్రతి దస్తావేజుకు గతంలో రూ.200 చెల్లించేవారని, ప్రస్తుతం ఆ చార్జి రూ.500కు పెంచినట్లు చెప్పారు. వీలునామా రూ.100 నుంచి రూ.500, ఈసీ, నఖలు రూ.20 నుంచి రూ.100 చేశారన్నారు.

ఇంటర్‌లో గురుకులం విద్యార్థుల ప్రతిభ

కోట: ఇంటర్ ఫలితాల్లో కోట బీసీ గురుకుల కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జూనియర్ ఇంటర్‌లో 86 మందికి 77 మంది ఉత్తీర్ణులు కాగా ఎంపీసీ విద్యార్థి రాపూరు సాయికృష్ణ 470కి 460 మార్కులు సాధించి బీసీ గురుకుల కళాశాలల్లో ఉత్తమ ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపల్ నారాయణరావు తెలిపారు.

అలాగే సీనియర్ ఇంటర్‌లో 95 మందికి 91 మంది ఉత్తీర్ణులు కాగా బైపీసీ విద్యార్థి శ్రీతేజ 957 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అధ్యాపకులు, ప్రిన్సిపల్ ఈ సందర్భంగా అభినందించారు.